

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి : 13 జూలై, 2016 సంచిక : 2

**సంస్థాపకులు :**

**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**

**ప్రధాన సంపాదకత్వం**

**శ్రీ మాతా శుకవాణి**

భాషా ప్రవీణ, M.O.L.,M.A

**ప్రత్యేక సహకారం**

**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**

**ప్రచార సారథ్యం**

**శ్రీ ఎం. సత్యనారాయణ** M.Tech

**సాయివాణి చందా వివరాలు**

ద్వైవార్షిక చందా.......... రూ॥ 160/-

ఆజీవ సభ్యత్వం .......... రూ॥ 800/-

**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**

సాయిధామం, రామలింగంపల్లి(పోస్టు),

బొమ్మల రామవరం మండలం,

నల్గొండ జిల్లా - 508 126.

**Ph : 9440413455, 9848133565**

E-mail : saidhamam.seva@gmail.com, saidhamam.ram@gmail.com

**విషయసూచిక** **పుట సంఖ్య**


మా వాణి .......... 2
భారతీయ సాధువు .......... 4
ఆరని వెలుగు .......... 5
రాజేడీ-రాజ్యమేదీ? .......... 7
గురువాణి-6 .......... 9
స్వరాంజలి .......... 11
వినండి నా మాట .......... 12
శ్లోకవాణి .......... 14
శుకవాణి .......... 15
జగద్గురు తత్త్వబోధకస్వామి .......... 17
సాకోరీ మహర్షి .......... 19
మాతృసంస్థ కబుర్లు .......... 22
శ్రీ గజానన విజయం .......... 23
షిరిడీ డైరీ .......... 25
శ్రద్ధ-సాధన .......... 28
గురుదేవుల విగ్రహావిష్కరణ .......... 29
బ్రహ్మచారి కథ .......... 31







# మా వాణి



పాఠకలోకానికి శ్రీ సాయిరక్ష.

ప్రేమ-ప్రేమ-ప్రేమ - అదో తిరుమంత్రంలాగా జపించేవారు గురుదేవులు. ఈ రెండక్షరాల పదంలో అనంతమైన శక్తి ఉన్నది. ప్రేమలో ఎన్నో రకాలున్నాయనీ, వాత్సల్యం, సోదర ప్రేమ, సతీపతి ప్రేమ-వగైరాలు చాలా యిందులో అంతర్భాగాలనీ కొందరంటారు. కానీ అటువంటి వాటిలో మమకారం అనేది మిళితమై ఉంటుంది. అచ్చపు ప్రేమలో స్వచ్ఛతే తప్ప ఒక పక్షపాతంగానీ, షరతులు-ఇలా ఉంటేనే ప్రేమించగలను-అన్నది గానీ, మా వర్గం, మా దేశం - యిలాటి హద్దులుగానీ ఉండవు. అలాంటిదే - అసలైన ప్రేమ. ఇది మనలోపల సుస్థిరంగా ఏర్పడాలంటే మొదట 'ఆత్మవత్సర్వభూతాని' అన్నది ఒంటబట్టాలి. పరమపూజ్య గురుదేవుల నిత్యానుష్ఠాన మంత్రం "ఆకృతులు వేరైనా ఆత్మ ఒక్కటే" మనకు ఒంటబడితే గానీ స్వచ్ఛప్రేమ మనలోకి రాదు. ఇక్కడొక చిన్న మెలికె ఉంది.

ప్రేమ ఏర్పడితే అన్ని ప్రాణులూ నాలాంటివే అనుకోగలమా-లేక యీ భావం ఏర్పడితే ప్రేమ స్థిరపడుతుందా? కొందరు జన జనాంతర సాధనల బలం వలన సహజంగానే ప్రేమమయులుగా జన్మించవచ్చు. మరికొందరు సాధనతో, విజ్ఞతతో దాన్ని సాధించవచ్చు. రెండూ సంభవమే. అసలు మనం మాట్లాడుకొనే మాటలనే పరిశీలిద్దాం - ఒక్క నిమిషం.


నేను - రెండక్షరాలు. నీవు - రెండక్షరాలే - "వాడు, ఆమె, వీడు, అది, ఇది, అవి, ఇవి" - అన్నీ రెండక్షరాల మాటలే. వీటిలో కొన్ని కలిపితే 'మేము' అవుతుంది. దానికి కొంత బలం ఉంటుంది. కానీ, అది కొన్ని పరిమితులకు లోబడి ఉంటుంది. ఒకే కుటుంబీకులకో, ఒకే గ్రామీణులకో, ఒకే వర్గం

వారికో మాత్రమే 'మేము' అనే శబ్దం చెల్లుతుంది. ఇక మిగిలిందీ - అత్యంత బలిష్ఠ మైనదీ, శక్తిమంతమైనదీ "మనం" అన్నది. ఇదీ రెండక్షరాల పదమే. దీనికీ బలం ఎక్కడినుంచీ వచ్చింది? ఇందులో నేను, నీవు దగ్గర మొదలుపెట్టి వ్యక్తి ఎరుకలో, అతని ఆలోచనా పరిధిలో ఉన్న సమస్త ప్రాణులూ అందులోకి వచ్చేస్తాయి. ఈ పదానికి పరిమితులు లేవు. కుల, మత భేదాలు స్త్రీ, పురుష భేదాలు, దేశ కాల పరిస్థితులు ఏవీ ఉండవు. ఉదాహరణకు "మనం అందరం భగవంతుని బిడ్డలమే" - "ఈ వాక్యం చూడండి. ఈ వాక్యంలో 'మనం దేనిని సూచిస్తుంది? సర్వజీవజాలాన్నీ తనలోకి లాక్కొంటున్నది. అందుచేత - నాలోని ఆత్మే అక్కడా ఉంది, ఇక్కడా ఉంది, ముందరా ఉంది, వెనకా ఉంది - అనుకొంటే వ్యక్తి "నేను' కాడు- 'మనం' అవుతాడు. ప్రేమకు మూలమవుతాడు. ఆ ప్రేమే సేవకు మూలమవుతుంది. ప్రేమలేని సేవ పెద్ద ఆత్మవంచన. అది కృతజ్ఞతను కోరుతుంది. ప్రతిఫలాన్ని ఆశిస్తుంది. కీర్తి, ప్రతిష్ఠలను కోరుకొంటుంది. తానెంత సేవ చేసిందీ పదేపదే గుర్తు చేసుకొంటుంది.

అందుచేత, ప్రియమిత్రులారా, అవధులెరుగని, పరమాత్మ స్వరూపమైన స్వచ్ఛ ప్రేమను పెంచుకొందాం. "గాడ్ యీజ్ లవ్" అన్నది విఖ్యాతవాక్యమే. ఇవ్వేళ సినీ తెరల మీద, టి.వి.తెరల మీద, పబ్లిక్‌పార్కుల్లో, కొన్నిచోట్ల కాలేజీలలో విశృంఖలంగా కనిపించేది ప్రేమ కాదు - కామం. లవ్ కాదు- లస్ట్. అది జీవితాలను తేజోమయం చేయకపోగా వికృతం చేస్తుంది. ప్రేమ అంటే త్యాగం. విశ్వమానవాళి కళ్యాణం కోసం తనను తాను సమర్పించుకొని కరిగిపోవటం ప్రేమ. అటువంటి ప్రేమ సాధన కోసం వ్యక్తిగతానందాలకు స్వస్తి పలికి, "నా ఆత్మలోనే సర్వాత్మలూ మిళితమై ఉన్నాయి. సర్వాత్మల సౌభాగ్యంలోనే నా ఆత్మవికాసం ఉన్నది" అన్న భావాన్ని క్షణక్షణం పెంచుకొందాం. ఆ సాధనకు తోడ్పడమని సాయిప్రభువును, గురుదేవులను వేడుకొందాం.







# భారతీయ సాధువు



అలెగ్జాండరు భారతదేశానికి వచ్చినపుడు తాను జయించిన దేశాలన్నింటిలోకీ ఎక్కువ సత్యవంతులు, వివేకులు, సౌందర్యవంతులూ అయిన వారిక్కడే ఉన్నారని గ్రహించారు. ఈ గడ్డకు శిరోమణులైన సాధువు లను, వేదాంతులను చూడాలనుకొన్నాడతడు. సింధూ నదీ తీరంలో అతడొక సాధుపురుషుడిని చూచాడు. అలెగ్జాండర్ జగత్తుకే అధినేతగా భావింపబడుతున్నాడు. సాధువేమో ఒంటిమీద సరైన బట్ట కూడా లేనివాడు. అలెగ్జాండర్ వ్యక్తిత్వం చాలా గొప్పది. సాధువు కళ్లు కూడా తేజోవంతంగా మెరుస్తున్నాయి. "నా చూపులతోనే ప్రభువులకు ఘనతనూ, సుందరులకు సౌందర్యాన్నీ యివ్వగలను" అన్నట్లున్నాయవి.

ఆయన అత్యద్భుతమైన ఆధ్యాత్మిక వ్యక్తిత్వం అలెగ్జాండరునెంతగానో ఆకర్షించింది. "స్వామీ! నా మీద కరుణ చూపించండి. గ్రీసు దేశంలో చిన్న చిన్న వస్తువులక్కూడా ఎంతో విలువ ఇస్తారు. ఇక్కడేమో మీవంటి అనర్ఘ రత్నాలను కూడా యిలా అలక్ష్యం చేస్తారు. మీరు కరుణించి నాతో రండి. రాజ్యం, సంపద, మణి మాణిక్యాలు - ఏవి కావాలంటే అవి ఇస్తాను మీకు. దయ చేసి రండి" అని ప్రార్థించాడు.

సాధువు మెత్తగా నవ్వి, "నేను అంతటా ఉన్నాను. సర్వవ్యాపకుడిని. అంతరిక్షాని క్కూడా అతీతుడిని" అన్నాడు. ఆయన భావం అలెగ్జాండరుకు అవగతం కాలేదు. మళ్లీ తన కోరికను విన్నవించుకొన్నాడు. ఎన్నెన్నో ఆశలు చూపాడు. సాధువు "నాకేమీ అక్కరలేదు. నేను ఊసిన ఉమ్మినే నాకే రకాన్ని కాను" అన్నాడు.

అంతవరకు అలెగ్జాండరు మాట తిరస్కరించిన వారెవరూ లేరు. అంచేత ఆయన అవమానంతోనూ, కోపంతోనూ ఊగిపోయాడు. సర్రున కత్తి దూసి "చంపేస్తాన"న్నాడు. సాధువు విరగబడి నవ్వాడు. "నీ జీవితంలో

నువ్వాడిన అబద్ధాల్లోకెల్లా యిదే పెద్దది" అన్నాడు. పైగా - "నన్ను చంపగల కత్తి యింతవరకు ఎవ్వరూ తయారుచెయ్యలేదు" అని కూడా అన్నాడు.

"చిన్నపిల్లలు ఇసుకలో కూర్చొని పిచ్చుకగూళ్లు కడతారు. కాస్సేపు ఆడి చితక్కొట్టేస్తారు. దానివలన ఇసుకకేమీ నష్టం కలగదు. అది ఎప్పటిలాగే ఉంటుంది. నేను సర్వాధారమై, శాశ్వతమైన ఇసుకనేగానీ ఇల్లును కాను. ఈ శరీరాన్ని ఎవరైనా కూలగొట్టదలచుకొంటే వాడు తన యిల్లు కూలగొట్టుకుంటున్నట్లే. ఇసుకకు ఎలాంటి నష్టమూ ఉండదు. అది ఎప్పుడూ యిసుకే. కాంతినీ, నక్షత్రాలనూ ఎవ్వరూ వేరు చెయ్యలేరు. నేనూ, నీవూ వేర్వేరు కాము. ఒక్కరమే".

సాధువు పలికిన యీ పలుకులతో అలెగ్జాండరు చేతిలోని కత్తి జారిపోయింది. అతడు సాధువు పాదాలపై వాలిపోయాడు.

## ఆరని వెలుగు

- సేకరణ (ద విజన్ నుండి)

ఒక జపాన్ నటుడు రెండవ ప్రపంచ యుద్ధానికి ముందర హాలీవుడ్‌లో ఉండేవాడు. అతడు యిక జన్మలో ఒక్కపైసా కూడా సంపాదించనక్కరలేనంతగా ఆర్జించాడు. ఉన్నదానితో ఎంతో విలాసంగా బ్రతకగలడు. అంచేత అతడు తన మాతృభూమికి తిరిగి వెళ్లిపోదామనుకొన్నాడు. అలా వెడుతూ త్రోవలో పారిస్‌లోని ఒక విలాసవంతమైన హోటల్లో బస చేసాడు. ఆ రాత్రి అక్కడ జరుగుతున్న 'కేసినో' - జూదం లాంటి దానిలో పాల్గొన్నాడు. తాను ఆర్జించి తెచ్చుకున్న మొత్తం ఆ ఆటలో ఓడిపోయాడు. జపాన్ వెళ్లేందుకు దారి ఖర్చు కూడా మిగల్లేదు. అతను నిశ్శబ్దంగా తన గదికి వెళ్లిపోయాడు. హోటలంతా కూడా నిశ్శబ్దం





నిండిపోయింది. గతంలో రాజులు, చక్రవర్తులు కూడా ఆడారక్కడ. కానీ, అంత పెద్ద మొత్తం ఎవ్వరూ పెట్టలేదు, ఓడనూ లేదు. హోటల్లో అందరికీ ఆ జపాన్ నటుడి పట్ల సానుభూతి కలిగింది.

ఆ రాత్రి గడిచింది. మరునాటి ప్రొద్దున్న వార్తాపత్రికల్లో ఒక జపానీయుడు రైలు క్రిందబడి ఆత్మహత్య చేసుకున్నాడన్న వార్త వచ్చింది. హోటల్ యజమాని, పనివారు, రాత్రి ఆట చూచినవాళ్లు - అందరూ కూడా చనిపోయింది జపాన్ సినీనటుడే అనుకొన్నారు. అందరూ కలిసి అతని గదికి పరుగెత్తి గది తలుపు తట్టి చూచారు. అతను తలుపు తెరిచి, వీళ్లందరినీ చూచి, "ఏమిటిదంతా? ఎవరు మీరు?" అని అడిగాడు. వాళ్లు కొంచెం తడబడుతూ "పేపర్లో ఎవరో రైలు క్రిందపడి చచ్చిపోయారని వార్త విన్నాం. ముఖమంతా గుర్తుపట్టే వీలు లేకుండా చితికిపోయింది. అంచేత అది మీరేననుకొని .........." అన్నారు.

అతడు ఫక్కున నవ్వాడు. "నేను కాదులే! నేను సంపాదించాను-పందెంలో ఒడ్డాను-ఓడిపోయాను. కానీ పోయింది డబ్బేగానీ-నేను కాదు. డబ్బు మళ్లీ సంపాదించుకోగలను. అంతేకాదు-మళ్లీ ఓసారి వచ్చి యిక్కడ ఆడతాను. డబ్బు ఉన్నప్పుడూ నేనిలాగే ఉన్నాను-పోయినప్పుడూ యిలాగే ఉన్నాను. డబ్బు కోసం చచ్చిపోయేంత పిరికివాడినికాను నేను. నేను నటుడినయ్యే ముందు ఒక గురువును దర్శించాను. ఆయన నాకు ఒకే ఒక్క విషయం చెప్పారు - "నీవు ఎలాటి స్థితిలోనైనా ఒకే రకంగా ఉండు. మంచిలో, చెడులో - విజయంలో, అపజయంలో-లాభంలో, నష్టంలో, నీవంటూ ఉన్నంతకాలం కేవలం సాక్షివిగా చూస్తుండు" అని.

రాత్రి నేను హాయిగా నిద్రపోయాను. తిరిగి ఎక్కడ మొదలుపెట్టాలో ప్రయాణం అని ఆలోచిస్తున్నానంతే!" జపాన్ నటుని చిరునవ్వువైపే చూస్తూ ఉండిపోయారందరూ".

(ఓషో రచనల నుండి)



# రాజేడీ–రాజ్యమేదీ

- శ్రీ రమణాశ్రమ లేఖలు

ఈ మధ్యాహ్నం “ప్రాచీన శంకర విజయా’న్ని గురించిన ప్రసంగం వచ్చి భగవాన్ ఒక భక్తునితో “ప్రస్తుతం వాడుకలో ఉన్న శంకర విజయాలన్నిటికీ విలక్షణమైనది విద్యారణ్యులదే గదా? అన్నారు. “అవును. వారు చాలా మేధాసంపన్నులు గదా? వారి గ్రంథమే ప్రాముఖ్యంగా తీసుకుంటారందరు” అన్నారు భక్తులు. భగవాన్ చిరునవ్వుతో “అవును, వారి మేధాశక్తి చాలా గొప్పది. వారు శ్రీ విద్యోపాసకులు గదా? శ్రీ చక్రాకారంగా పట్నం నిర్మించాలని హంపీలో ప్రారంభించి విఫల మనోరథులై భవిష్యత్తున ఒక చక్రవర్తి రాగలరనీ, వారు శ్రీచక్రాకారంగా పట్నం నిర్మించగలరనీ వ్రాశారు. ఈ సంగతి కొండ మీద ఉండగా నాయన (గణపతి శాస్త్రి)తో నేనంటే వారొక విచిత్రమైన వ్యాఖ్యానం చేశారు. ఏమనంటే ‘శ్రీ చక్రాకృతి శోణశైలవపుషం శ్రీ షోడశార్ణాత్మకం’ అని అరుణాచలాష్టకం స్తోత్రంలో ఉన్నది. (శంకరాచార్య విరచితం). అదేగాక అరుణాచల పురాణంలో ఈ గిరి శ్రీచక్రాకరమని ప్రసిద్ధి. అందువల్ల వెతక్కుండానే మనకీ శ్రీచక్రాకృతి గల స్థానం లభించింది. భగవాన్ చక్రవర్తి గిరి చుట్టూ పది ఇళ్లు కడితే, ఇదే మహా సామ్రాజ్యం. వారు భవిష్యత్తును గురించి వ్రాసింది ఇదే అయి ఉంటుంద”ని వ్యాఖ్యానించి, ఇదుగో వీడు సేనాధిపతి. వాడు కోశాధ్యక్షుడు. వాడటీ, వీడిదీ అంటూ రాజ్యంగమంతా ఏర్పాటు చేసేవారు. వారిక్కడుండగా అదొక వేడుకగా ఉండేది. అందరూ కూర్చొని “ఏమోయ్, ఈ రోజున మన దర్బారుకంతా ఫలహారం ఏమిటి? అనేది, అదనీ, ఇదనీ, ప్రోగ్రాం వేసుకునేదీ, చేసేదీ, తినేదీ అంతా రాజ్యమేలుతున్నట్లే కార్యం నడిపేవాళ్లు, ఇదిగో యీ సుందరేశుడు, ఆ కల్యాణం, అప్పడిట్లా ఉండేవాళ్లా? అరే అప్పా. ఒక్కొక్క ఆసామి భలే హుషారుగా ఉండేవాళ్ళు. యోధులమనే అనుకునేవాళ్ళ”న్నారు భగవాన్.





“ఇదంతా ఎప్పడు” అన్నాడు శివానందం “విరూపాక్ష గుహలో ఉండగానే. ఒక్కొక్కప్పడు కట్టబోయే పట్నానికి కాగితం మీద ప్లాను కూడా వేసేవారు నాయన. అందులో నాకొక ప్రత్యేక స్థానం. వెనుక అన్ని ప్లానులూ రాజ్యాంగానికి తగినట్లుగా తయారుచేసేవారు. రాజులేడు, రాజ్యం లేదు. ప్లాను మాత్రం సిద్ధమయ్యేది. అట్లా ఎన్ని ప్లానులో. రాజేడీ, రాజ్యమేదీ?” అన్నారు భగవాన్. “రాజులేకేమి ఎదుటనే ఉన్నారు గదా? అయితే ఈ రాజు కౌపీనధారి. అంతేగదా? ఇప్పడేం తప్పింది? కొండచుట్టూ ఇళ్లు కట్టలేదా? భగవాన్ సన్నిధానం రాజాస్థానం వలె ఉండలేదా? అంతా వారన్నట్లే రాజ్యాంగం నడుస్తూనే ఉన్నది. మామూలు రాజ్యానికీ, దీనికి కొంచెం భేదం ఉంటుంది. అంతే”నన్నారు న్రాయున శిష్యులైన సుబ్బారావుగారు.

“అది సరి, మహారాజుదీ, మహాజ్ఞానిదీ ఒకటే దశ అని నాయన గూడా అంటూ ఉండేవారు. తథాగతుని గురించి కాలజ్ఞులు “ఇతడు చక్రవర్తి అయినా కావాలి లేక జ్ఞానసంపన్నుడైన సన్యాసి అయినా కావాల”ని అంటే ఎక్కడికీ పోనీయక అంతఃపురంలోనే ఉంచి భోగలంపటుని చేయాలని తండ్రి ఎంతో తంటాలుపడ్డాడు. కడకు వారేదో నెపంతో, ఎట్లాగో బయటికి వెడితే, లోకంలో ఉన్న కష్టమే గోచరించింది. పారిపోయి సన్యసించారు. ఏదో ఒకటి అన్నారు” భగవాన్.

# గురు వాణి-6

ఆత్మబంధువులారా,

"నకర్మణా, నప్రజయా నధనేన
త్యాగేనైకే అమృతత్వ మానశుః" - అన్నారు ఆర్యులు.

'త్యాగం' అన్నది చాలా లోతైన విషయం. తనకున్న దానిలో కొంత భాగాన్ని ఇతరుల కోసం యివ్వడం దానం. తన సర్వస్వాన్నీ త్యజించి వేయటం త్యాగం. ఇదొక్కటే మనను నిత్యత్వం-శాశ్వతత్వంవైపు నడప గలదు. మనం సంతానాన్ని పొంది వారి ద్వారా కీర్తి ప్రతిష్ఠలు పొందటమో, తిలాంజలులు పొందటమో ముక్తినివ్వదు. ఇది లౌకికానందప్రదం మాత్రమే. ధనార్జన చేసి, దానధర్మాలకుపయోగించినా పుణ్యం వస్తుందే తప్ప ముక్తి కలగదు. అది సర్వసంగ పరిత్యాగం వలన మాత్రమే లభిస్తుంది. మరి ఆ భగవత్ప్రాప్తి పొందదలచినవాడు దేనిని త్యాగం చెయ్యాలి? తనువు, ధనము, మనసు-మూడింటినీ వదలాలని శాస్త్రోక్తి. వీటిని వదలటం అంత సులభసాధ్యం కాదుగానీ-అసాధ్యం మాత్రంకాదు. ఒక్కొక్కటిగా చూస్తే -

తనువు పట్ల వ్యామోహాన్ని, తిండి, బట్ట, అలంకరణ మొదలైన వాటి మీది కోరికను, తనకు శరీరం ద్వారా వచ్చిన బంధుమిత్రగణాలతో బాంధ వ్యాలను, ధనకనకాదులను వదిలివెయ్యటం ద్వారా కొంత వదలవచ్చు. ఇది ఒక దశ. తన తనువు తనది కాదనీ, దానికి కలిగే బాధలు, వ్యాధులుగానీ, నిందాస్తుతులుగానీ తనకు చెందవని భావించగలగటం, ఆ మేరకు తత్ఫలితాలను మనసుకు పట్టించుకోకుండా వదిలివెయ్యటం మరో దశ. ఈ రెండు దశలూ దాటితే గానీ భగవత్స్పృహ నిరంతర స్రోతస్సుగా మనసులో ప్రవహించే అవకాశం కలగదు. ధనం మనం ఆర్జించుకొనేది. కనుక వదలటం తేలిక. తనువు మనదేనని భావించడం కాదు-అసలు అదే మనమని భావించటం చేత వదలటం చాలా యిబ్బంది. ఈ యిబ్బంది భ్రమ వలన - భ్రాంతి వలన ఏర్పడేదేగానీ సహజం కాదు. ఈ భ్రాంతి వదిలితే అది వదలడమూ కష్టం కాదు. తనువు ఆధారంగా





పెరిగేదే గనుక మనసు దాని మీది వ్యామోహంతోపాటే అంతరిస్తుందేమో నన్న భావన కలుగుతుంది. ఏది దేనికి మూలం అన్నది ప్రశ్న. తానే తనువన్న భావమే తనువు ఉనికికి బలం ఇస్తుంది. కాబట్టి మొదట మనసును అదుపులో ఉంచితేనే తనువుకున్న బలం తగ్గుతుందన్నది నిర్వివాదం.

మనస్సును అణచడం ఎలాగ? నిరంతర విచారణ ద్వారా యిది సాధ్యమవుతుంది. అలా తను, ధన, మనాలు మూడూ లయించిపోవటమే పరమాత్మకు ఆత్మసమర్పణ అవుతుంది. తనను తాను సమర్పించుకోవటమే త్యాగం. త్యాగంతోనే నిరంతర శాంతి, సచ్చిదానందం లభిస్తాయి. "త్యాగాచ్ఛాంతి రనంతరమ్". త్యాగం పరిపూర్ణం కావటం ఎలాగ?

మొట్టమొదట సంకల్పం - ఆ సంకల్పించుకొన్న దానిని సాధించాలన్న గాఢమైన సంసిద్ధత-అటుపైన సంకల్పసిద్ధికై కావలసిన సాధన-యివి మూడూ కలిస్తేనే సిద్ధి. కనుక యీ త్రివిధరీతులలోను కృషి చేస్తేనే మానవుడు త్యాగపూర్ణుడు కాగలడు. అంతేకాదు-పరిపూర్ణత్యాగి కావాలంటే తాను కరగక తప్పదు. 'తాను' కరిగితేనే నీటికి మాధుర్యాన్నివ్వగలదు పంచదార. తాను కరిగితేనే ప్రపంచానికి పనికి రాగలదు. ఆత్మార్పణ చేసుకున్నవాడు సాధు పురుషుడవుతాడు. సాధువు జీవితం సర్వాత్మనా విశ్వకళ్యాణం కోసం సమర్పితం కావాలి. అందుచేత సాధుజీవనంలో రవ్వంతైనా స్వార్థపరత్వం ఉండకూడదు. తమ సర్వశక్తులూ ధారపోసి, తాము కరిగిపోయిన గురువుల ఆత్మశక్తులే లోకాన్ని ధర్మమార్గాన నడపగలవు.

మేఘం తన లోపలి జలమంతటినీ ప్రకృతికి దత్తం చేసి చివరికి తానంటూ లేకుండా కరిగిపోతుంది. క్రొవ్వొత్తి చీకటిని తరుముతూ వెలుగులు ప్రసరించి, చివరికి తాను లేకుండాపోతుంది. గింజ తన స్వత్వాన్ని నశింపజేసుకుంటేనే ఒక మహా వృక్షానికి ప్రాణదానం చెయ్యగలదు. అదే మాదిరిగా వ్యక్తి అహంకార వినష్టి చేసుకొని, తానుగా నశించిపోతేనే ఒక శక్తిగా రూపొందగలడు. అటువంటి స్థాయికి చేరుకోవ డానికి దీక్షాకంకణబద్ధులు కావటమే సాధకుల కర్తవ్యం. తథాఽస్తు!

# సదా స్మరామి

\- శుకవాణి

సదా స్మరామి శ్రీ గురుచరణమ్
సదా నమామి భవభయ హరణమ్ ॥స॥

అఘాబ్ధి తరణమ్ శ్రీ గురు చరణమ్
సద్గతి కరణమ్ శ్రీ గురు చరణమ్
పావన చరణమ్ శ్రీ గురు చరణమ్ ॥సదా॥

తమిస్ర హరణమ్ శ్రీ గురు చరణమ్
శ్రీ చిహ్న ధరణమ్ శ్రీ గురు చరణమ్
పతితోద్ధరణమ్ శ్రీ గురు చరణమ్ ॥సదా॥

జ్ఞానావరణమ్ శ్రీ గురు చరణమ్
జీవైక శరణమ్ శ్రీ గురు చరణమ్
కరుణా భరణమ్ శ్రీ గురు చరణమ్ ॥సదా॥

# ఆణి ముత్యాలు

\- వేమన్న

ఎరుక యుండు వాని కెరుకయే యుండును
ఎరుక లేని వాని కెరుక లేదు
ఎరుక లేని ఎరుక నెరుగుట తత్త్వంబు
విశ్వదాభిరామ, వినుర వేమ!

మనసులోని ముక్తి మరియొక్క చోటున
వెదుక బోవువాడు వెర్రివాడు
గొఱ్ఱె చంకబెట్టి గొల్ల వెదకురీతి
విశ్వదాభిరామ, వినుర వేమ!





# వినండి నా మాట

\- ముప్పాళ్ళ దశవంతరావు

చెప్పలేదంటనక పొయ్యేరు నరులార
గురుని చేరి మ్రొక్కితె బ్రతుక నేర్చేరు
చెప్పలేదంటనక పొయ్యేరు.
తప్పదిదిగో గురుని వాక్యం
తప్పదారుల
బోవువారల చప్పరించుక మ్రింగు శక్తులు ॥చెప్ప॥

**శిష్యుడు :** చాలా బాగా సెలవిచ్చారు గురుదేవులు. స్వామీ! నేనెన్నో పూజలు జేశాను. శక్తికి మించి దానధర్మాలు జేశాను. ఆలయాలు కట్టించాను. అందరు దేవుళ్ళకు మ్రొక్కాను. నా మ్రొక్కులన్ని తు.చ. తప్పకుండా తీర్చుకున్నాను. ఇవి చాలవంటారా మోక్షప్రాప్తికి?

**గురువు :** నాయనా! మీరు చాలా మంచిపనులు జేశారు. దరిద్ర నారాయణుల సేవించటమనేదేమీ చిన్న విషయంగాదు. సేవలోనే దైవం ఉన్నాడని గ్రహించారు. భక్తే ముక్తికి మూలం. అది మీలో మెండుగ దండిగానే ఉంది. గుళ్ళు గోపురాలని ఎన్నెన్నో తిరిగారు. లెక్కకు మించి పూజలు జేశారు. దైవాన్ని దర్శించాలంటే హృదయార్ద్రత కావాలట... మనసు కరిగిపోవాలట.... మనస్సేకాగ్రత జెందాలట... మనోవాక్కాయ కర్మలతో స్వామిని అర్చించారా? భిక్ష గాడిలోను మీలోను ఉన్న సత్పదార్థమొక్కటేనని గ్రహించారా? అట్టి ప్రయత్నమైనా జేశారా? అలాచేసి తదనుగుణంగా మెదలినవాడే నిజమైన వేదాంతి.... భక్తుడు...భాగవతుడు. అటుగాక వాచా వేదాంతంతో అమాయక ప్రజలనాకర్షించి ధనార్జనే ధ్యేయంగా

తిరుగాడే శుష్కవేదాంతులనేమంటారు? మీరే చెప్పాలి!

**ఓ మహిళ :** అయ్యా! నేనన్నీ మంచిపనులే జేశాను. నేనెవ్వరికీ హాని చేయ లేదు.... తలపెట్టనూ లేదు. దైవాన్ని సర్వదా తలుస్తూ, కొలుస్తూనే ఉన్నాను. అట్టి నాకెందుకయ్యా శిక్ష? నా ఒక్కగానొక్క ముక్కు పచ్చలారని బిడ్డను నా నుండి దూరం జేశాడా భగవంతుడు. ఇది న్యాయమా? ఎందుకు నాకీ కడుపుకోత?

**గురువు :** అమ్మా! నీవు జేసిన మంచిపనులు నీవు పూర్వజన్మలో జేసిన పాపకృత్యాలను తగు మోతాదులో దహించివేస్తాయి. మిగిలిన పాప క్షయం, మోక్షార్హత పొందేందుకు మరో జన్మ తప్పదు గదా!

ఇక చిరుప్రాయంలో నిన్ను వీడిన నీ బిడ్డ విషయానికొద్దాం! ఆ పుణ్యచరితుడు మీ గర్భాన ఉదయించటం మీ అదృష్టంగాదా? గత జన్మలో జేసిన చిరు పాప క్షయం కొరకే గదా ఆ బిడ్డ జన్మించాడు. వచ్చిన పని పూర్తయింది. లోక ధర్మానుసారం కాలం జేయటం విధి నిర్ణయమే గదా! పుట్టకముందతడెవరు... నీవెవరు? పుట్టినందునందుకు మోదం ... గిట్టితే ఖేదం ... ఎందుకంటావు? ఈ అద్దె కొంపలో కొంతకాలం సుఖమో .. దుఃఖమో... అనుభవించి పెరవారికి మనం చోటివ్వటం ... విదితమే గదా!

"పునరపి జననం పునరపి మరణం
పునరపి జననీ జఠరే శయనం"

అన్న శ్రీ శంకర భగవత్పాదుల వారి అనుగ్రహ భాషణం వినలేదా? పుట్టిన వాడు గిట్టక మానడు... అది నేడో ... రేపో! సుఖదుఃఖాలు ఎనుబది నాలుగు లక్షల జీవరాసులకు సహజమే గదా! అలాగే చావు పుట్టుకలు ... వగచరాని దానికై వగచుట శ్రేయోదాయక మనగలమా? ఆలోచించండి!





# శ్లోకవాణి

- శుకవాణి

ఇవి రెండూ చాలా చిన్న శ్లోకాలు. కానీ అనర్ఘ రత్నాలు. చిటికెలో కంఠస్థం చేయవచ్చు. పాఠకులందరూ నేర్చుకొని మీమీ పిల్లలకు, మనుమలకు నేర్పవచ్చు. అలా నేర్పితే పిల్లలకు ఉచ్చారణ సరై ఎలాంటి భాషైనా చక్కగా నోరు తిరుగుతుంది.


"తృష్ణే దేవి, నమస్తుభ్యం, యా త్వం సర్వత్ర సర్వదా ।
ఉత్పాదయస్య యత్నేన గోష్పదే సాగర భ్రమమ్ ॥

- ఓ ఆశాదేవీ, నీకు నమస్కారం తల్లీ! గోష్పదమ్ - అంటే ఆవు కాలి గిట్టంత నీటిగుంటను అనంత జలనిధి అయిన సముద్రమంతగా భ్రమింప జేయగలవు. నీవు కలిగించే భ్రాంతికి కాలపరిమితిగానీ, స్థల పరిమితిగానీ లేవు. ఆ భ్రాంతి కూడా అప్రయత్నంగా అలవోకగానే కలిగిస్తావు. ఎంత శక్తిమంతురాలివే!

"ద్వావిమౌ పురుషే లోకే స్వర్గస్యోపరి తిష్ఠతః ।
ప్రభుశ్చ క్షమయా యుక్తః, దరిద్రశ్చ ప్రదానవాన్ ॥

- పుణ్యం చేసినవారు స్వర్గం చేరుకుంటారు. కానీ యిద్దరు మాత్రం స్వర్గాన్ని దాటి ఊర్ధ్వలోకాలకు వెడతారు. వారెవరయ్యా అంటే - అధికారం చేతిలో ఉండి కూడా ఓర్పు కోల్పోకుండా సంయమనంతో వ్యవహరించే ప్రభువూ, సర్వం దానధర్మాలు చేసేసి దరిద్రుడైపోయిన వ్యక్తీను. క్షమకూ, దానానికీ ఉన్న విలువ ఎంతటిదో దీన్నిబట్టి తెలుస్తున్నది - ఈ రెండూ సంతరించుకోగలిగిన పుణ్యపురుషుల భాగ్యం ఎంతని వర్ణించగలం! పరమపూజ్య గురుదేవులు అడిగిన వారికే కాదు - అడగని వారికైనా వారి అవసరాలను తామే గమనించి దానాలు చేస్తూ ఉండేవారు. ఇక క్షమలో జిత సర్వంసహులు - అన్నిటినీ భరించగల భూదేవినే జయించగల వారన్నది మన అనుభవమే.

# శుకవాణి



- మాతా శుకవాణి

శుకప్రోక్తమైన భాగవతంలోని సప్తమ స్కంధంలోనిది దిగువ పద్యం. ప్రహ్లాద చరిత్ర చెప్పిన తరువాత - "శ్రీ మహావిష్ణుని ద్వారపాలకులైన జయవిజయులు ముని శాపగ్రస్తులై తొలిభాషణ హిరణ్యాక్ష, హిరణ్య కశిపులుగా, మలి జన్మలో రావణ కుంభకర్ణులుగా, మూడవ జన్మలో శిశుపాల, దంతవక్త్రులుగా శ్రీహరి పట్ల వైరం వహించి, ఆ కక్షతో ఆయననే స్మరించి, ఆ వైర భక్తితోనే శాపవిముక్తులయ్యారు" అని చెప్పిన నారదుడు ధర్మరాజుతో ఇలా అన్నాడు -

**"జలజాత ప్రభవాదులున్ మనములోఁ జర్చించి భాషావళిన్**
**బలుకన్ లేని జనార్దనాహ్వయ పరబ్రహ్మంబు నీ యింటిలోఁ**
**జెలియై, మేనమఱందియై, సచివుడై, చిత్తప్రియుడై మహా**
**ఫలసంధాయకుడై చరించుట మహాభాగ్యంబు రాజోత్తమా!"**

- "ఓయి ధర్మనందనా, జనార్దనుడు (శ్రీకృష్ణుడు) స్వయంగా పరమాత్ముడే. ఆయనకు తన వారు, పెఱవారు అన్న భేదం ఉండదు. స్వయంగా భాషాదేవికి (సరస్వతికి) పతియైన విధాత కూడా ఆయనను గూర్చి ఏమీ పలుకలేడు. ఎందుకంటే ఆ తండ్రి అవాఙ్మానస గోచరుడు గనుక! అందుకే "మనములో చర్చించనూ లేడు - భాషావళిన్ పలుకన్ లేడు" అన్నారు పోతన్నగారు. అలాంటి మహాపురుషుడు - ఓ ధర్మజా, నీ యింట మిత్రుడిలాగా, బావగా, మంచి చెడులు వింగడించగల మంత్రిగా, నీ మనస్సుకెంతో ప్రీతిపాత్రుడై - అన్నింటినీ మించి మహత్తర ప్రయోజనాలను సాధించి యివ్వగల వరదాయకుడై నీతో, నీ వారితో





కలిసిమెలిసి ఉండటం ఎంత భాగ్యమయ్యా!" అన్నారు.

స్వయంగా పరమాత్ముడే మనకంత సన్నిహితంగా రావాలంటే మనం ఎలా ఉండాలి? పాండవులు పూర్తిగా కృష్ణునిపైనే ఆధారపడ్డారు. తనకంటె చిన్నవాడైన కృష్ణుని ఎంతగానో మన్నించాడు ధర్మజుడు. అర్జునుడు సఖ్య భక్తితో, భీమసేనుడు నిత్యస్మరణతో కృష్ణయ్యను వశపరుచుకొన్నారు. నకుల సహదేవులు అన్నల అడుగుజాడలలోనే నాయె! ఇక ద్రౌపదీదేవి సంగతి చెప్పేదేమున్నది! వైరులు వలువలూడ్చినా ఆయనే దిక్కు- అతిథి సేవకు (దూర్వాసుని) అభ్యంతరం కలిగినా అతడే దిక్కు- తనకు కలిగిన అవమానానికి ప్రతీకారం చేయాలన్నా అతడే దిక్కు. కుంతీదేవి ఏకంగా యాదవుల పట్ల, పాండవుల పట్ల కూడా తనకు గల మమతాపాశాన్ని తెంచమని కోరుతూ, "త్రుంపవే భవలతల్ నిర్వాణ సంధాయకా!" అని ప్రార్థించింది.

అదుగో ఆ విధంగా సర్వ సమర్పణ చేసుకొని "నీవే ఏడుగడవు" అంటేగానీ పరమాత్ముడు మనవాడు కాడు. కానీ, గురువులు పరమ కరుణాళువులు. భగవంతునిది పితృప్రేమ అయితే గురువులది మాతృప్రేమ. 'అమ్మా!' అనగలిగితే చాలు. మేమందరం గురుదేవులు స్వామీ సత్యపదా నంద ప్రభుజీ వారికి ఏమిచ్చుకున్నాం? పరిపూర్ణ భక్తీ లేదు, శిష్యరికమూ లేదు. ఆత్మార్పణ పెదవుల మీది నుండేగానీ ఆంతర్యంలో నుండీ వచ్చిందా? వస్తే ఎంత శాతం? అయినా సరే ఆ మహనీయులు మా యిళ్లలో ఉండి - మా చేతి వంట తిని - మా ఆగడాలన్నీ భరించి, మమ్మల్ని తీర్చిదిద్ది, క్షమించే తల్లిగా - హితవరి అయిన తండ్రిగా - అభిమానం పంచే అన్నగా - మా సమస్యలు తీర్చే సచివుడిగా - ముక్తిమార్గం యిటూ అని చెప్పిన గురువుగా మాలో ఒకరుగా ఉండటం ఎన్ని జన్మల సుకృతమో గదా! క్షణక్షణం ఆయనే రక్ష.

# జగద్గురు తత్త్వబోధక స్వామి

**- రాబర్టో డీ నోబిలీ అనే క్రైస్తవ ఫాదరీ చరిత్ర**

**- శ్రీ దిగవల్లి శివరావుగారి కథలు-గాథలు నుండి**

(గత సంచిక తరువాయి)

ఇంకొక ఉత్తరంలో తాను చేసే బోధను నోబిలీ వర్ణించాడు. "నా దగ్గర వచ్చిన వాళ్ళకందరికీ భగవంతుడొక్కడేననిన్నీ, ఆయన క్రైస్తవులు నమ్మే మూడు మూర్తులలో సాక్షాత్కారం అవుతున్నాడనిన్నీ, ఆయన అనంతుడనిన్నీ, భూమండలమును, మనుష్యులను, సర్వజంతువులను సృష్టించినవాడనిన్నీ, మానవులను రక్షించేటందుకు మానవ శరీరాత్మలతో ఒక దివ్యకన్యాకుమారి కడుపున పుట్టినాడనిన్నీ, ఇలాగ పుట్టిన అవతార మూర్తి ఏసుక్రీస్తు అనిన్నీ, ఇతడు నిర్వికారుడనిన్నీ, మానవుల పాపముల నన్నింటినీ తాను భరించిన రక్షకుడనిన్నీ" చెప్పి ఆ మతధర్మాలను బోధించేవారు.

"ఈ మతధర్మాన్ని స్వీకరించేవారెవ్వరూ తమ కులాచారాలను వదులుకోనక్కరలేదు. ఇంకొక కులంలో చేరనక్కరలేదు. తన కులాచారాలకు విరుద్ధమైన ఏ పనినీ చేయనక్కరలేదు. భగవంతుని సాక్షిగా ఈ పవిత్ర మతధర్మము అన్నివర్ణాలకూ అర్హమైనది. బ్రాహ్మణులు, క్షత్రియులు మొదలైన ప్రజలందరు లౌకికవ్యవహారాలలో ఈ దేశపురాజైన మహానాయకుడి శాసనానికి ఎలా లోబడి ఉంటారో ఆధ్యాత్మిక విషయాలలో మానవులందరికీ ప్రభువైన భగవంతుని ధర్మశాసనానికి అన్ని కులాల వారూ, అన్ని తరగతులవారూ లోబడిఉండాలి. ఈ దేశంలో పూర్వపు ఋషులు, సన్యాసులు చెప్పే ధర్మాలనే నేను కూడా చెప్పతున్నాను. ఈ ధర్మాలు





కేవలము అస్పృశ్యులకూ, ఫరంగీలకూ అర్హమైనవని ఎవరయినా అంటే వారు మహాపాతకం చేస్తున్నారన్నమాట. అన్ని కులాల మనుష్యులకూ భగవంతుడు ప్రభువు గనుక ఆయన ధర్మాన్ని అందరూ శిరసావహించాలి. ఈ ధర్మానికి లోబడినందువల్ల యింకను ఉన్నతమైనస్థితిని చెందని ఉన్నత కులము లేదు. తన పవిత్రతను ఆవంతయైనా తగ్గకుండా ప్రపంచములోని అన్ని కులాల మీదను, వస్తువుల మీదను సూర్యరశ్మి ఎలా ప్రసరిస్తున్నదో, అది బ్రాహ్మణులను అపవిత్రపరచకుండా ఎలాగ తేజస్సునిస్తున్నదో యీ ఆధ్యాత్మిక సూర్యరశ్మి కూడా మనుష్యులందరికీ తన పవిత్ర ధర్మాన్ని, పవిత్ర తేజాన్ని ప్రసాదిస్తుంది" అని నోబిలీ ఉద్బోధించేవాడు.

## ఉపన్యాస ధోరణి

నోబిలీ చేసే ఉపన్యాస పద్ధతి కూడా చాలా చిత్రంగానూ, దేశీయంగానూ ఉండి శ్రోతల మనస్సులనూ, హృదయాలకూ బాగా నాటేటట్లు వుండేది. నోబిలీ తాను స్వయంగా చక్కని పద్యాలనెన్నో రచించి వాటిని శ్రావ్యంగా చదివేవాడు. ఈ దేశంలో మతధర్మాలను, పురాణాలను చెప్పే వారి పద్ధతిలో ముందుగా తాను చెప్పదలచిన మతధర్మాన్ని గురించి భావగర్భితమైన ఒక సూత్రాన్ని చెప్పి దానికి వ్యాఖ్యానం చెప్పడంలో అనేక గ్రంథాలలోనుంచీ, తన సొంత కవిత్వంలోనుంచీ శ్లోకాలు, పద్యాలూ, కథలూ, గాథలు వివరిస్తూ దీర్ఘమైన ఉపన్యాసం చేసేవాడు. మంచి విచక్షణాజ్ఞానంతో తప్పలు వెదకడానికి నడుము కట్టుకుని కూర్చున్న వారున్న సభలలో యీ విదేశీయుడొక సంవత్సరంలోనే దేశభాష నభ్యసించి తన పాండిత్యానికీ, భాషాజ్ఞానానికీ సభవారు ఆశ్చర్యపడేటట్లుగా ఇంత జయప్రదంగానూ, అనర్గళంగానూ ఉపన్యసించగలిగారంటే అతడు గొప్ప ప్రతిభాశాలి అనక తీరదని ఒక గ్రంథకర్త వ్రాశాడు.

**(సశేషం)**

# సాకోరీ మహర్షి

## 2వ అధ్యాయం

### జననం, బాల్యం

కాశీనాథ్ 1870 మే 5వ తేదీన జన్మించాడు. తన 8వ ఏట ఉపనయనం అయింది. మూడేళ్ళపాటు ఒక స్వదేశీ ఎలిమెంటరీ స్కూల్లో చదువుకున్నాడు. అక్కడి ఉపాధ్యాయుడు ఒకరోజు అతని చొక్కాలేని శరీరం పైన బెత్తంతో పశువును బాదినట్లు బాదాడు. ఒళ్ళంతా వాతలు తేలిపోగా నొప్పితో కేకలు పెడుతూ కాశీనాథ్ ఇంటికి పారిపోయాడు. ఆ కోపంతో, చికాకుతో మరెప్పడూ స్కూలుకు వెళ్ళలేదు. అతనికి ఆ అయిష్టత క్రమంగా పెరిగిపోయి చదువు అన్న దాని మీద తేలిక అభిప్రాయం ఏర్పడింది. పెద్దలు చెప్పిన ఏవో పాఠాలు పేరుకు మాత్రం వింటున్నప్పటికీ ఆయన మనసులో చదువు మీద శ్రద్ధ ఏర్పడలేదు. పొట్టకూటి కోసం పనికిమాలిన, అనేక రకాల విజ్ఞానపు సరుకుతో బుర్ర నింపుకోవడమే చదువు అన్న భావన ఆయనలో స్థిరపడిపోయింది. తన తాతగారు ఎందరో శిష్యులకు కాశీనాథ్ సమకాలికులకు విజయవంతంగా బోధించినవేగా. ఈయన బుర్రకెక్కలేదు.

శారీరకంగా అతను ఒక బలమైన భారీకాయం కలవాడు. తన అతి స్వేచ్ఛ ప్రవర్తనల వలన కొంత జబ్బు శరీరం కూడా. అతను తన శరీరాన్ని అపురూపంగా ఏమీ చూసుకోలేదు. ఇష్టం వచ్చినట్లు ఉపవాసాలు ఉంచడం, వేపాకు నూరిన ముద్దలు తినడం, పులుసులు తినిపించడం యిబ్బంది పెట్టాడు. విశ్వనానా అనే ఒక వెర్రి ఆరాధకుడు అతని బాల్యంలో అతన్ని యిలా నడిపించాడు. ఆ తరువాత తన శరీరం తన శత్రువుగా





భావించసాగాడు కాశీనాథ్. ఒక్కొక్కసారి అతను యిలా అనేవాడు "దీన్ని చూడండి. మన కష్టం మీద శుభ్రంగా బలిసింది. పైగా మనం దాన్ని పోషించటం కోసం అతిహీనమైన చదువులు చదివేలాగా ప్రేరేపిస్తుంది. వెంటబడి తరుముతుంది కూడా. ఆయన పొరుగున ఉన్న ఒక ఇంద్రియ భోగలాలసుడు తన సంపదను, శక్తిని కూడా రకరకాల పదార్థాలు, పిండి వంటలు వండుకొని ఆరగించటంలోనే ఖర్చు పెట్టేవాడు. ఒకసారి ఆయనకు కలరా వచ్చింది. వివేకం లేకుండా అతడు దిగమింగిన పదార్థాలన్నీ వాంతి చేసుకున్నాడు. తన రుచులతో సహా చచ్చి ఊరుకున్నాడు. ఇదీ కాశీనాథ్‌లో ఏర్పడి ఉన్న సిద్ధాంతానికి బలాన్నిచ్చాయి. "చూడండి. చూడండి. మీరే చూడండి. ఆ విశ్వాసహీనమైన - కాదు కాదు విశ్వాసఘాతుకమైన శరీరం శుభ్రంగా మేసినంత కాలం మేసి అతణ్ణి అలా నిలువునా ముంచేసింది. అలాంటప్పడు అది మనకు శత్రువు కాక మిత్రుడెలా అవుతుంది?" అన్నాడు. అది విన్న పెద్దవాళ్ళు అతణ్ణి కోప్పడనూ లేదు అతని మాటలు పెద్దగా పట్టించుకోనూ లేదు. వానాకాలంలో ఏర్పడిన మట్టీ బురదా వసంతంలో శుభ్రపడిపోయినట్లే వయస్సుతో అతని భావాలు పరిపక్వమవుతాయిలే అనుకొని నవ్వి ఊరుకున్నారు. ఈ పిల్లవాడు ఆధ్యాత్మిక సాధనలో మొదటి మెట్టు ఎక్కుతూనే దేహమే తానని సర్వత్ర (అందరిలో) కనిపించే భ్రాంతిని తిరస్కరించి తన ఆత్మను శరీరపు ఒర నుంచి తొలగించే ప్రయత్నం చేస్తున్నాడనుకొన్నారు. కాశీనాథ్ అన్నింట్లోనూ బాగా కొసకంటా వెళ్ళిపోవడం, అతనినెవరూ మందలించకపోవడంతో సహజంగానే ఎన్నో గోతుల్లో పడ్డాడు. అతని జీవితానికే మొప్పం (ప్రమాదం) వచ్చింది కూడా. కానీ నిత్యపర్యవేక్షకుడైన పరమాత్ముడు ఆయన కోసం మరో గొప్ప లక్షణాన్ని నిర్దేశించి ఉంచాడు.

ఓ రోజు బాలకాశీనాథుడు నీళ్ళు తోడుతున్న యంత్రంలో గిరగిర తిరిగే చక్రాన్ని చూశాడు. దాని మధ్యలో ఓ చిన్న సందుంది. అందులో వేలు పెడితే ఎలా ఉంటుంది అనుకున్నాడు మనవాడు. ఎలాగూ ఈ వేలు తాను కాదుగా అనుకోని వెంటనే తన ఆలోచనను అమలులో పెట్టేశాడు. వెంటనే అతని వేలు అందులో నలిగిపోయింది. తనకు తెలియకుండానే వేలు చటుక్కున వెనక్కు లాక్కున్నాడు. తీవ్రమైన బాధ కలిగింది. కాలక్రమంలో అతనిలో కొక్కిరి పనుల్లో తేడా వచ్చిందిగానీ అతని సిద్ధాంతాల్లోగానీ, ఆలోచనల్లోగానీ మార్పు రాలేదు. కాశీనాథ్‌కి తుపాకులంటే మహా ఇష్టం. ఇప్పడు స్వామి తన చిన్నప్పటి దేహాత్మ సంబంధాల ప్రయోగాలు గుర్తించి గుర్తు చేసుకుని నవ్వుకుంటారు. శరీర మనేది అనేక శక్తులతోను, ప్రత్యేకతలతోను, సమర్థతలతోను, కర్మలను బట్టి లభించినప్పటికీ, యిప్పడు ప్రయత్నపూర్వకంగా దాన్ని జయించ వలసిందే. కానీ, యీ విజయం శరీరాన్ని అసహ్యించుకోవటంతోకాక-దాన్ని సరైన విధంగా చివరకంటా ఉపయోగించుకోవడం ద్వారానే సాధించాలి. తన ఆత్మ గమ్యాన్ని సాధించడానికి శరీరం ఎంత ప్రముఖ పాత్ర వహిస్తుందో ఆయన అర్థం చేసుకున్నారు. ఆ భావాన్ని ఇంకా విస్తరిస్తూ విశ్వంలోని తనువులన్నీ ఒకటై అన్ని ఆత్మలు ఒకటిగా కాగలవని కూడా గ్రహించారు. మనసుని సరైన జ్ఞానం వైపు మరల్చడానికి, ఉన్నతమైన సహజజ్ఞానంవైపు మరల్చడానికి సాధన అవసరం. కానీ స్వచ్ఛమైన అంతర్ జ్ఞానం, భగవత్‌స్పృహ కలగాలంటే తాను నేర్చిన విద్యలు, వాటి వాసనలతో సహా వదిలించుకోకతప్పదని కూడా ఆయన గ్రహించారు. కానీ, తొలినాళ్ళలో ముఖ్యంగా నవయవ్వనంలో శరీరం మనిషికి శత్రువేననీ, నేర్చే జ్ఞానమంతా శరీరం కోసమేననీ ఆత్మకోసం కాదనీ మొండిగా నమ్మేవారు. **(సశేషం)**





# మాతృసంస్థ కబుర్లు

సాయిధామంలో పెరిగి వివాహం అయి బయటకు వెళ్లిన చి॥ సాయిదత్త నవజాత శిశువుకు 21 రోజులు నిండిన సందర్భంగా సాయి ధామానికి వచ్చారు వాసు, సాయిదత్తలు. వారి అత్తమామలు ప్రతిరోజూ రాత్రిపూట ఏడ్చే పాపాయి ఉన్న రెండు రోజులూ రాత్రిపూట అస్సలు ఏడ్వనే లేదు. సాయిదత్త మామగారు శ్రీరాములుగారు ఎంతో సంతోషంతో 'అమ్మా గురువుగారి శక్తి కరుణల వల్ల ఎప్పడూ సరిగా నిద్రపోని నా మనుమరాలు యిక్కడ యింత హాయిగా నిద్రపోతున్నద'ని సంతోషం వ్యక్తం చేసారు. ఆ రోజు సాయిధామం ట్రస్ట్ సభ్యుల సమావేశం జరగటంతో అందరి ఆశీస్సూ దొరికింది ఆ పాపకు. ఆ చిట్టితల్లికి మాతాజీ 'చారుశీల' అని నామకరణం చేసారు. సాయంత్రం చారుశీలను ఉయ్యాలలో వేసారు. వచ్చిన సాయిధామం అభిమానులకు ముత్తైదువలకు, పండ్లూ, తాంబూలాలు ప్రసాదం యివ్వటంతో కార్యక్రమం పూర్తి అయింది. మే 29 ఆదివారం మాతాజీగారి పూర్వ విద్యార్థులైన శ్రీమతి జయ, పద్మ, కవితక్కగార్లతో కలిసి సాయిధామం పిల్లలంతా బాసర వెళ్ళి శ్రీ సరస్వతీ దేవిని, పూజ్య గురుదేవులు తపస్సు చేసిన వ్యాస గుహను సందర్శించారు. కవితక్క చొరవ వలన పిల్లలకు విశ్రాంతి కోసం ఎ.సి. రూము ఏర్పాటు చేయటం విశేషం. దారంతా పద్మక్క, జయక్క, కవితక్క గార్ల హుషారు మాటలతో పిల్లలకు ఎంతో ఉత్సాహం కల్గింది.

# శ్రీ గజానన విజయం



- ప.పూ.శ్రీశ్రీశ్రీ సత్యపదానంద ప్రభుజీవారు

(గత సంచిక తరువాయి)

## 15వ అధ్యాయం

మహారాష్ట్ర వజ్రం శ్రీ బాలగంగాధర తిలక్ తమ జీవితకాలమంతా జాతి పునరుజ్జీవనం కోసం అవిశ్రాంతంగా పనిచేసిన మహనీయుడు అపర భీష్మాచార్యుడి వంటి ఆ మహనీయుని ఘనత నేనేమని వర్ణించ గలను? ఆయన రచనాశైలి అద్భుతం. స్వతహాగానే బృహస్పతి అంతటి గొప్ప వక్త. తిరుగులేని ప్రజానాయకుడై లోకమాన్యుడనిపించుకొన్నవాడు. ఒకసారి శివాజీ జయంతి సందర్భంగా వారిని విదర్భకు ఆహ్వానించారు. విదర్భ ప్రజలకు శివాజీ ప్రియతముడు. ఆయన తల్లి జిజియాబాయి సింద్‌ఖేడ్ ఆడబడుచే. శివాజీకి విదర్భా, మహారాష్ట్రా రెండూ ఆదరప్రాంతాలే.

తమ ప్రాంతానికి వేంచేస్తున్న తిలక్ మహాశయునికి గజాననుల ఆశీస్సులు దొరికితే బావుంటుందని కొందరు భావించారు. కానీ మరికొందరు "మహరాజ్ రావటం సభ జరిగే తీరును భగ్నం చేయవచ్చు. ఆయన తిలక్ మహాశయుని కొట్టినా కొట్టవచ్చు" అన్నారు. కానీ అకోలా వాసులు కొందరు గజాననులను ఆహ్వానించాలని షేగాఁవ్ వెళ్లారు. తమ దగ్గరకు వస్తున్న కపర్దేను చూచిన మహరాజు తాము శివాజీ జయంతికి వస్తామనీ, ఏమీ గొడవ చేయమనీ, తిలక్ గౌరవానికి భంగం కలిగించమనీ చెప్పారు. నాయకోత్తముడైన తిలక్‌ను, అతని స్నేహితుడూ, అలందిలోని నృసింహ సరస్వతి శిష్యుడూ అయిన అన్నా పట్వర్ధన్‌ను చూడాలని తనకు కూడా ఆతురతగా ఉన్నదని కూడా ఆయన చెప్పారు.

కపర్దే చాలా ఆనందించి కొల్హాట్కర్‌తో "చూడూ-యోగీశ్వరులే





మంటున్నారో! మనం ఆహ్వానించకుండానే మనం వచ్చిన పని వారికి తెలిసిపోయింది. వారు వచ్చి సభను ఆశీర్వదిస్తానన్నారు గదా! ఇక మనం తిరిగి వెడదాం పద" - మహరాజుకు సాష్టాంగపడి లేచి ఇద్దరూ అకోలాకు తిరిగి వెళ్లారు.

ఆరోజు అక్షయ తృతీయ గనుక పితృదేవతలకు నివేదనలు పెట్టుకునే ప్రాచీన ఆచారం ఉంది. అయినాగానీ తిలక్ వస్తూండటం చేత జనం పెద్దసంఖ్యలో తరలివచ్చారు సభకు. ప్రాంగణం క్రిక్కిరిసిపోయింది. ప్రతి వారికీ గజాననుల దర్శనం కావాలన్న ఆతురత కూడా ఉంది. అప్పటికే ఆయన సభాస్థలికి వచ్చి ఉన్నారు. సాధువెన్నడూ మాట తప్పరు. ఆయనకు వేదిక మీద ఎత్తైన ఆసనం వేసారు. తిలక్‌జీకి ముందుకు వేసారు. అన్నా సాహెబ్ పట్వర్ధన్ ఆయన ప్రక్కనే కూర్చున్నారు. కుడి ప్రక్కన కపర్దే, దేశాబ్, భావే, దయలే మొదలైన వారు సభానిర్వాహకులు.

సభ ప్రారంభమైంది. ప్రారంభోపన్యాసాల తరువాత తిలక్ మాట్లాడ సాగారు. "ఇవ్వేళ చాలా సుదినం. ఢిల్లీ, బీజాపూరు సుల్తానులకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య పోరాటం చేసిన శివాజీని స్మరించుకొంటున్నాం. ఆయనకు సమర్థ రామదాస స్వామి పవిత్ర ఆశీస్సులు లభించాయి. వారి కలయిక వివేకం, శౌర్యాల కలబోత. ఇప్పుడు విదేశీయుల క్రింద నలిగిపోతున్న జాతికి అలాటి శక్తుల కలయిక అవసరం. ఈనాటి మన స్వరాజ్య పోరాటాన్ని ఆశీర్వదించడానికి షేగాఁవ్ నుంచీ గజానన మహారాజులు వేంచేసారు. మనం స్వరాజ్యం పోగొట్టుకున్న నాటి నుండీ బానిసత్వపు మేఘాలు దేశమంతా ఆవరించుకొన్నాయి. ఈ అజ్ఞానం నుండీ మన జనావళిని నిద్రలేపాలంటే మంచి విద్య కావాలి. బ్రిటీష్‌వారు వ్యక్తిత్వ నిర్మాణం చేసే విద్యను అందించరు". ఇంకా తిలక్ బ్రిటీష్ పరిపాలనను విమర్శిస్తూ మాట్లాడారు.

(సశేషం)



ఓం శ్రీ సాయిరాం

# షిరిడీ డైరీ

- మాన్యశ్రీ జి.ఎస్. కపర్దే
అనువాదం : మాతా శుకవాణి

(గత సంచిక తరువాయి)

దాదాసాహెబ్ 1879లో వ్రాసిన పాకెట్ డైరీ ఒకటి దొరికింది. ఇందులో కొన్ని ముఖ్యమైన విషయాలు ఉన్నప్పటికీ చాలా పేజీలు ఖాళీగా ఉన్నాయి. కొన్ని పేజీలలో చెదురుమదురు వాక్యాలు ఉన్నాయి. 1890 నుంచి 1938 వరకు 46 డైరీలు దాదాసాహెబ్ కపర్దేగారి సొంతవ్రాతతో ఉన్నాయి. ఈ 46 డైరీలు జాతీయ ప్రాచ్యలిఖిత భాండా గారంలో ఉంచబడ్డాయి. 1879కి ముందర వ్రాసిన డైరీలుగానీ, 1880 నుంచి 1893 వరకుగానీ లేవు. ఆయన వ్రాయలేదు. వీటిలో 1938 డైరీ మాత్రం భారతదేశంలో తయారైన నేషనల్ డైరీ, నాలుగు కాలిన్స్ డైరీలు. మిగిలినవి విదేశాలలో తయారైన లేట్స్ డైరీలు. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో లేట్స్ డైరీలు దొరకలేదు కనుక వేరేవి వాడుకలోకి వచ్చాయి. ప్రతి డైరీ 12.5 అంగుళాల పొడవు, 8 అంగుళాల వెడల్పుతో ఉన్నాయి. దాదాసాహెబ్ తన ప్రయాణాలలో తన డైరీ మోసుకొని వెళ్ళేవారు. తేదీలవారీగా జరిగిన విషయాలన్నీ తాను రాత్రి నిద్రపోయే ముందర వ్రాసే అలవాటు ఉండేది. ఇది ఒక క్రమపద్ధతిలో నడిపారాయన. రైల్వేస్టేషన్‌లలో ప్రయాణీకులు వేచి ఉండే గదులలో, ఏ అర్ధరాత్రో, ఒక్కోసారి ఒంటి గంటకో రెండు గంటలకో వ్రాసిన సందర్భాలు కూడా చాలా ఉన్నాయి. తరువాతి సంవత్సరాలలో అలా రాత్రిపూట నిద్రకు ముందర వ్రాయటం కష్టమవుతోందని నిన్నటి విశేషాలన్నీ ఇవ్వాళ ప్రొద్దున వ్రాయటం మొదలుపెట్టారు. అందుచేత ఆయన కలలు, దృశ్యాలు, గాఢ నిద్ర అన్నీ యీ డైరీలలో కన్పిస్తాయి. ఆ విషయం అల్పమైనా, ముఖ్యమైనదైనా వీటిలో చోటు చేసుకోవటం కన్పిస్తుంది. సందర్శకుల పేర్లు,





వారి సంభాషణల సారం, సంభాషణలు, ముఖ్యమైన స్వభావాలు, ప్రశ్న జవాబుల రూపంలో వివరంగా, నిజాయితీగా పెద్ద స్పష్టమైన చేతివ్రాతతో ఒక్క కొట్టివేత గానీ, ఒక్క హంసపాదుగానీ లేకుండా వరుసగా వ్రాసుకొంటూ వెళ్లారు. ఆయనకు అనారోగ్యంగా ఉన్నపుడు కూడా డైరీ మానలేదు. ఆయన మరణించిన 1938 జూలై 1న, ఆ ముందరిరోజు మాత్రమే ఏమీ వ్రాయలేదు. ఆఖరి తేదీ 29, జూన్ 1939 ఆయన వ్రాతకు.

దాదాసాహెబ్ కపర్దే షిరిడీని బాబావారి జీవితకాలంలో ఐదు సార్లు దర్శించుకొన్నాడు. ఆయన అలా వెళ్లిన సమయం తేదీలవారీగా యిస్తున్నాం.

**తొలి దర్శనం - 1910 డిసెంబరు 5 నుండి - 1910 డిసెంబరు 10 వరకు**

**రెండవసారి దర్శనం - 1911 డిసెంబరు 6 నుంచీ - 1912 మార్చి దాకా**

**మూడవసారి దర్శనం- 1915 డిసెంబరు 29 నుండీ - 19**

**నాల్గవసారి దర్శనం- 1917 మే నెల 19వ తేదీ -లోకమాన్య తిలక్‌తో**

**ఐదవసారి దర్శనం - ఎన్ని రోజులున్నదీ తెలియదు - మార్చి 1918**

మనం ప్రతి యాత్రను విడివిడిగా చూస్తే దాదాసాహెబ్ కపర్దే జీవితచరిత్రలో ఇంకా ఏమి విశేష సమాచారం దొరుకుతుందో 1924-25ల్లో సాయిలీలలో ప్రచురించినవి కాక.

## తొలియాత్ర డిసెంబరు 1910 :

దాదాసాహెబ్ కపర్దే పూనే నుంచి బొంబాయికి తన కొడుకు బాలకృష్ణతో వచ్చి డిసెంబర్ 5 నాడు షిరిడీకి వెళ్లాడు. ఏడు రోజులయ్యాక బాబా అనుమతితో డిసెంబరు 12న షిరిడీ విడిచి 13న అకోలా చేరాడు. రైల్వే ప్రయాణంలో మూడు నాలుగు తరగతులుండే ఆ రోజుల్లో సాధారణంగా అతను ఫస్టు క్లాసులోనే ప్రయాణించేవాడు. కానీ యీసారి డబ్బు సరిపోకపోవడంతో రెండవ తరగతిలో అకోట్ మీదుగా ప్రయాణించి 19న అమరావతి చేరాడు. అమరావతి రైల్వేస్టేషన్ నుండి ఇంటిదాకా కాలినడకన వెళ్లినట్లు వ్రాసి ఉంది. దాదాసాహెబ్ ఒంటి పై

స్థాయిలో ఉన్న ఒక మనిషి ఇంటికి వెళ్లడానికి బండి అద్దెకు తీసుకోలేకపోవడం అన్నది ఆశ్చర్యకరంగా ఉంటుంది. న్యాయవాద వృత్తి ద్వారా అతని వార్షిక ఆదాయం 90 నుంచి 95 వేల వరకు ఉండేది. ఆదాయపు పన్నులు లేని రోజులవి. జీవన వ్యయం కూడా చాలా తక్కువ. అంత ఆదాయం ఉన్నప్పటికీ దాదాసాహెబ్‌కు ఇలాంటి పరిస్థితులు తప్పేవి కావు. కారణం అతను ఆదాయాన్ని మించి ఖర్చు పెట్టటమే. ఒక దశలో రెండు ఆస్ట్రేలియన్ గుర్రాలతోసహా ఏడు గుర్రాలు రెండు బండ్లు - అందులో ఒక దర్జాది - ఒకటి మామూలుది - వాటిన్నటినీ చూడటానికి ఉద్యోగులు.

ఆయన అనేక కుటుంబాలకు ఆశ్రయమిచ్చాడు. తన ఇల్లు అతిథులకు ఎప్పుడూ తెరిచే ఉండేది. ఇల్లు నిండిపోయిన ఆ అతిథుల సౌకర్యం కోసం, వినోదం కోసం విపరీతంగా ఖర్చు పెట్టేవాడు. అందులో విలాసవంతమైన పార్టీలు కూడా ఉండేవి. పాఠకులకు ఇప్పుడర్థమయి ఉంటుంది - ఆయన స్టేషను నుంచి ఇంటికి ఎందుకు నడవవలసివచ్చిందీను.

## రెండవ యాత్ర డిసెంబరు 1911 :


దాదాసాహెబ్ కపర్దే రెండవసారి వందరోజులు షిరిడీలో ఉన్నారు. ఇదే ఎక్కువకాలం ఉండడం. దాదాసాహెబ్‌కు, ఆయన భార్యకు అమరావతికి వెళ్లిపోవాలని కోరిక ఉన్నప్పటికీ సాయిబాబా వారికి షిరిడీలోనే ఎందుకు ఆపి ఉంచారో ఇంకా వివరాలు చూద్దాం -

దాదాసాహెబ్‌కు తన సద్గురువు పట్ల అచంచలమైన విశ్వాసం ఉండడం వల్ల ఆయన సాయిబాబా ఆజ్ఞలను బాబా నిర్ణయం తన మంచికేనన్న భావంతో, కర్తవ్యభావనతో తలవంచాడు. షిరిడీలో ఆయన కపర్దేను ఇంతకాలం ఎందుకు ఉంచి ఉంటారు? పాఠకులకు తెలుసు - దాదాసాహెబ్ లోకమాన్య తిలక్‌కు సహాయకుడు, సహచరుడూను. తిలక్ 1908 జూన్ 24న ఖైదు చేయబడి రాజద్రోహం నేరం క్రింద విచారణలో ఉన్నాడు. అతని నేర విచారణ 13 జూలై 1908న ప్రారంభమైంది. నేరస్తుడిగా నిర్ణయించి 22 జూలై 1908న ఆరేళ్ల జైలు శిక్ష విధింపబడింది.

(సశేషం)







# శ్రద్ధ-సాధన

- స్వామీ పరమాత్మానంద

నేను పదమూడేళ్లపాటు తిరువణ్ణామలైలో ఉన్నాను అక్కడ. శ్రద్ధ అనేదాన్ని నేర్చుకొన్నాను దాదాపు అన్నేళ్లూను. పదేళ్లపాటు ప్రతిరోజూ పూజ చేసేవాడిని. అటుపైన ఒకరోజు నా గురువు, మాస్టర్ -'ఇవ్వేళ నీ పూజ చూస్తాను నేను' అన్నారు. యధావిధిగా చేసాను. మా మాస్టర్ నీవు చేసే దానిలో శ్రద్ధ లేదు. కేవలం సంప్రదాయం ఉన్నది. నీవు ఎవరిని పూజిస్తు న్నావో ఆ విగ్రహం వైపే చూడ్డం లేదు. నీ దృష్టి చేతిలో పుస్తకం మీద, వస్తువుల మీద, ఇటు అటు తిరుగుతోంది తప్ప అసలు దాని మీద లేదు. నీవు పుష్పాలతో అర్చిస్తున్నావు. పూలను చూడు-స్వామిని చూడు-పాదాలు చూడు-అక్కడ శ్రద్ధతో ఉంచు. అగరు ధూపం వేస్తున్నావు-దాన్ని చూడు-ఆ ధూపం అందుకొంటున్న స్వామి ముఖం చూడు. ఆ పరిమళం ఆయన ఆనందిస్తున్నట్లు గమనించు. నివేదన పెడుతున్నావు-మంత్రాలు గొణిగి ఊరుకోకు. పదార్థంవైపు చూడు- స్వామికి అందించు-ఆ పెదవులవైపు చూడు. నీ ఎదురుగా ఉన్నది బొమ్మ అని నీవు అనుకోవటం లేదు. స్వయంగా భగవంతుడే అనుకొంటున్నావు. అలాంటప్పుడు నీ శ్రద్ధ యిలా ఉండాలి" అన్నారు.

మరునాడు అక్షరాలా ఆయన చెప్పినట్లేచేసాను. ఒక చిత్రమైన ఆనందం నాకు కలిగింది. ఏకాగ్రత కుదిరింది. స్వామిపై ప్రేమానుబంధం బలపడి నట్లనిపించింది. ఒక్క పూజలోనే కాదు-ఏ పనిలోనైనా శ్రద్ధ ఉండాలనీ, ఆ శ్రద్ధే సాధనగా మారుతుందనీ తెలిపిన మరో సంఘటన చెప్తాను.

నా బట్టలు ఉతుక్కొని తీగ మీద ఆరేసి వచ్చేస్తున్నాను. మా మాస్టర్ "ఒక్కసారి నీ బట్టలవైపు చూడు" అన్నారు. "బాగానే ఉన్నాయి గదా!" అన్నాను ఒకసారి చూచి. "ఏమీ లోపం కన్పించలేదా?" అని అడిగారు. లేదన్నాను. "అంచులన్నీ ఒకే పద్ధతిలో వరుసగా ఉన్నాయా? చూడు" అన్నారు. ఏ పని చేసినా శ్రద్ధ చూపితే క్రమంగా అదే సాధనై సరైన త్రోవలో నడుపుతుందని అప్పడు అర్థమై స్థిరపడింది.





# గురుదేవుల విగ్రహావిష్కరణ

## ప్రథమ ఆరాధనోత్సవాలు–సాయిధామం



శ్రీ సాయిదత్త పీఠాధిపతులు, సాయి ప్రసన్నులు, శ్రీ సాయీ సేవా సమితి ట్రస్ట్, సాయిధామం, సాయినాథ క్షేత్రం, కోదండ రామ సాయి సన్నిధానం సేవాశ్రమాల వ్యవస్థాపకులు, పరమపూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ వారు శ్రీసాయిలీనులైపోయి సంవత్సర కాలమైపోయింది. కాలానికి కరుణలేదు గదా! స్వామి వారి ప్రథమ ఆరాధనోత్సవం జూలై 9, 10, 11 తేదీలలో (ఆషాఢ శుద్ధ పంచమి, షష్ఠి, సప్తమి తిథులలో కీర్తిశేషులు శ్రీ మాన్యశ్రీ వడ్లమూడి మల్లికార్జున దీక్షితుల వారి శిష్యులు శ్రీ కుమారశర్మగారి చేత త్రయాహ్నిక దీక్షా హోమాలతో జరుగనున్నది. విగ్రహావిష్కరణ తిథి వైవస్వత సప్తమినాడు రావటం మన మహద్భాగ్యం. అందుకై ఆ పావనమూర్తి అభిమానులకు, శిష్యులకు, భక్తులకు అందరికీ యిదే మా హార్దికాహ్వానం. కార్యక్రమం దిగువ రీతిలో ఉంటుంది.

| | |
|---|---|
| 9.7.2016 | ఉదయం 8 గం.ల నుండీ |
| శనివారం | గణపతి పూజ, పుణ్యాహవచన, దీక్షాధారణాదులు |
| ఆషాఢ శుద్ధ | ఉదయం : 10 గం.-గం.12.30 వరకు తిరిగి |
| పంచమి | 3 గం.-6 గం.ల వరకు ఆదిగురువు-దత్తప్రభు పారాయణ |
| | 11 గం : విష్ణు సహస్ర నామము, హనుమాన్ చాలీసాల పారాయణ |
| సాయంత్రం : | అఖండ స్థాపన, అంకురారోపణ, పంచకాటక పంచోపనిషత్ హోమాదులు |



| | |
|---|---|
| 10.7.2016 | ఉదయం : నిత్యవిధి, వాస్తు పూజ, పర్యగ్నీకరణ, తదితర |
| ఆదివారం | హోమాలు, స్వామీజీ విగ్రహానికి పంచగవ్యాధివాస, |
| ఆషాఢ శుద్ధ షష్ఠి | క్షీరాధివాస, జలాధివాసాలు |
| ఉదయం : 9 గం.: | శ్రీ సాయినాథ చరితామృతం పారాయణ |
| 10 గం. | శ్రీ సాయిచాలీసా పారాయణ, భజన, సంకీర్తన, నామ సంకీర్తన - (5.00 గం.ల వరకు) |
| సాయంత్రం : | నిత్యవిధి, ప్రధాన కలశస్థాపన, మూర్తిహోమం, దిశా హోమ, పంచకాటక హోమాదులు ధాన్యాభిషేకం, పుష్పాభిషేకం, పంచశయ్యాధి వాసం, అధివాసాంగ హోమాలు |

| | |
|---|---|
| 11.7.2016 | ఉదయం : నిత్యవిధి, రత్నన్యాసం, భక్తుల జపశక్తి సమర్పణ |
| సోమవారం | గం.8.02 ని. సుముహూర్తాన పరమపూజ్య |
| ఆషాఢ శుద్ధ సప్తమి | గురుదేవుల విగ్రహావిష్కరణ, గురునామ సంస్తుతి |
| (వైవస్వత సప్తమి) | ఉదయం 9.30 ని. "స్మృతి లహరి" గురుదేవుల సంస్మరణిక పుస్తకావిష్కరణ-శ్రీ వీరమాచనేని వెంకట కృష్ణారావుగారు |
| 10 గం. | సాధు సభా ప్రారంభం, సాధు సత్కారం-ప్రవచనాలు, ఆశ్రమం మాట దానాదికాలు మహా కుంభాభిషేకం, పూర్ణాహుతి, ఆశీర్వచనాదులు |
| గం.1.00 | అన్నప్రసాద వితరణ |

ప్రియ సాయిభక్తులారా,

ప్రసన్నత, తేజస్సు, విజ్ఞత, ప్రేమ, కరుణ కలబోసి రూపొందిన దివ్యమూర్తి మన గురుదేవులు. ఆ చల్లనయ్య పాలరాతి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేయగలిగేదీ, ఆ పెదవులపై చిరునవ్వు తేగలిగేదీ మన ప్రేమాభిమానాలూ, భక్తి విశ్వాసాలే. అందరూ తరలి రండి-తరిద్దాం.

ఫోన్స్ : 9440413455, 9848133565 - ధర్మాధికారి, సాయిధామం

# బ్రహ్మచారి కథ

**సేకరణ : సాయిధామప్పు సాయితేజస్విని**

ఒక ఆశ్రమంలో ఇద్దరు ఋషి కుమారులు ఉండేవారు. వారి పేర్లు శౌనకుడు, అభిప్రతారి. వారు వాయుదేవుణ్ణి పూజించేవారు. ఒకరోజు మధ్యాహ్నం వారు భోజనం చేయబోయే ముందు ఎవరో వాకిలి బయట నిలబడి ఆహారం కావాలని భిక్ష అడగడం వినిపించింది. వారు మారు ఆలోచించకుండా అతణ్ణి పొమ్మన్నారు. నిజానికి అలా ఆహారం కావాలని కోరింది ఒక బ్రహ్మచారి. అతడికి చిన్నవయసులోనే బ్రహ్మజ్ఞానం అబ్బింది. ఈ విధంగా పొమ్మని చెప్పించుకోవడం అతనికేమీ కొత్త కాదు. కానీ, వారు ఋషి కుమారులై ఉండీ అలా అనడం అతనికి ఆశ్చర్యం కలిగించింది. వారికి ఒక గుణపాఠం నేర్పాలని అతడు అనుకొన్నాడు. అందువలన "మీరు ఏ దేవుణ్ణి ఉపాసిస్తూ ఉంటారు?" అని ఆ ఋషి పుత్రులను అడిగాడు. "మేము వాయుదేవుణ్ణి ఉపాసిస్తాము. ఆయనకు మరో పేరు ప్రాణం!" అని వారు గర్వంగా సమాధానం చెప్పారు. అప్పుడు బ్రహ్మచారి యిలా వివరించడం మొదలుపెట్టాడు. "ఓ మహర్షులారా! ఈ ప్రపంచం యావత్తూ ప్రాణం వల్లనే రూపుదాల్చిందనీ, తిరిగి ప్రాణంలోనే లయం అవుతుందనీ మీకు తెలుసనుకుంటాను. కాబట్టి ఈ చరాచర సృష్టి అంతా ప్రాణస్వరూపమని మీరు ఒప్పుకుంటున్నారు! అవునా?" అవును. మాకు యీ విషయం తెలుసు. ఈ విశ్వమంతా ప్రాణంతో నిండి ఉందని భేషుగ్గా తెలుసు. మాకు తెలిసిన విషయాన్నే నీవు మళ్ళీ చెపు తున్నావే!" అని వారు అసహనంగా జవాబిచ్చారు. "మరి మీరు యిప్పుడు వండిన భోజనాన్ని ముందుగా ఎవరికి నివేదించి స్వీకరిస్తారు?" అని ప్రశ్నించాడు. "మేము ఆరాధించే వాయుదేవుడికే నివేదిస్తాము" అని వారు బదులు పలికారు. అది విని ఆ బ్రహ్మచారి "ఈ విశ్వం అంతా ప్రాణంతో





నిండి ఉంది. ఇంతకు పూర్వమే మీరు ఒప్పుకున్నారు. ఆ ప్రాణం కోసమే మీరు నైవేద్యాన్ని తయారుచేశారు. నాలో ప్రాణం ఉంది కాబట్టి యీ విశ్వంలో నేను కూడా ఒక భాగమే. ఈ ఆకలితో ఉన్న బ్రహ్మచారి రూపంలో కూడా ఆ ప్రాణమే మిమ్మల్ని భిక్ష అడుగుతోంది గదా!" అన్నాడు. ఋషిపుత్రులు, "ఈ వివరణ చాలా బాగుంది. నీవు చెప్పింది ముమ్మాటికీ సత్యం!" అని మెచ్చుకున్నారు. "మరి నాకు భిక్ష ఇవ్వకుండా పొమ్మనడమంటే, నాలోని ప్రాణాన్ని అంటే వాయుదేవుణ్ణి పొమ్మనడమేగా?" అని ఆ బ్రహ్మచారి ఎత్తి పొడిచాడు. ఆ ఋషిపుత్రులకు జ్ఞానోదయమే అయింది, సాదరంగా ఆ బ్రహ్మచారిని లోనికి ఆహ్వానించి అతనితో నైవేద్యాన్ని పంచుకున్నారు. ఈ సృష్టి అంతా భగవంతునితో నిండి ఉంది. మనం యీ విషయాన్ని అనుక్షణం గుర్తు పెట్టుకుని మసలుకోవాలి. తోటి వారికి సహాయపడడం ద్వారా మనం ఆ పరబ్రహ్మానికే సేవ చేస్తున్నాము. అంతేకాక తోటి వారికి సేవ చేయటం ద్వారా మనకు మనమే సేవ చేసుకుంటున్నాము కూడా!

నీ అంతర్గత శక్తులనూ, ఆలోచనలను, ప్రేమను పంచుకో. నీ లోపలి కమలం వికసిస్తే తేనెటీగలు వాటంతట అవే కమ్ముకుంటాయి. మొదట ఆత్మవిశ్వాసాన్నీ, తరువాత భగవద్విశ్వాసాన్నీ పెంచుకో. ఒక్క పుంజీడు మంది దృఢ మనస్కులు ప్రపంచాన్ని మార్చగలరు. మనకు స్పందించగల సున్నిత హృదయం, సంకల్పించగల మెదడు, కర్మాచరణం చేయగల దృఢ హస్తం కావాలి. నిన్ను నీవు కర్మకు యోగ్యునిగా తీర్చిదిద్దుకో. చేసేవాడు భగవంతుడేగానీ- నీవు కావు. సమస్త విశ్వం ఒక్క వ్యక్తిలోనే ఇమిడి ఉంటుంది. ఈ విశ్వ నిర్మాణానికి వెనుక ఉన్నది ఒక్క పరాణువే. నీ మెదడుకు (ఆలోచనకు) హృదయానికి ఘర్షణ ఏర్పడినపుడు నీ హృదయాన్నే అనుసరించు.

**- స్వామీ వివేకానంద**